సభకు చీమల దండులా కదలిరావాలే

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు
- కాల్వశ్రీరాంపూర్‌లో రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

బీఆర్ఎస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 24 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభకు అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలందరూ చీమల దండులా కదలివచ్చి సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. రజతోత్సవ సభకు సంభందించిన వాల్‌పోస్టర్‌ను పలువురు కార్యకర్తలతో కలిసి గురువారం కాల్వశ్రీరాంపూర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో గోడలకు అంటించి ప్రచారం చేశారు. అనంతరం రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. సర్కారుపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రాబోవు రోజుల్లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు ఇస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధును పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. అర్హులైన రైతులకు రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాటం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామ గ్రామానా గులాబీ సైనికులు దండులా తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు జాలిగం రఘు, కుమార్ , మహేశ్, శ్రీకాంత్‌రావు, రవి, అరవింద్ ఉన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకుడు కౌశికహరి

'కుందనపల్లికి' శాశ్వత పరిష్కారం చూపాలి

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

అంతర్గాం, ఏప్రిల్ 24 : కుందనపల్లి గ్రామస్తులకు ఎన్టీపీసీ యాజమాన్యం శాశ్వత పరిష్కారం చూపాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. యాజమాన్యం నామమాత్రపు చర్యలతో కుందనపల్లి గ్రామస్తులకు బూడిద కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని, గ్రామస్తులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుందనపల్లి నుంచి పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తుజేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. నాయకులు కౌశిక హరి, నారాయణ దాసు మారుతి తదితరులు ఉన్నారు.

రుణాల కోసం మండుటెండలో..

కోల్‌సిటీ, ఏప్రిల్ 24 : రామగుండం నగర పాలక సంస్థలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండో రోజూ మండుటెండలో అవస్థలు పడాల్సి వచ్చింది. గురువారం ఎస్‌బీఐ మున్సిపల్ శాఖ, జల్లారం, జ్యోతినగర్ శాఖ బ్యాంకుల పరిధిలోని అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. పిల్లా, పాపలతో వచ్చిన మహిళలు మండుటెండలో ఉక్కపోత అరిగోస పడ్డారు. మున్సిపల్ శాఖ, జ్యోతినగర్ శాఖ పరిధిలోని అభ్యర్థులకు కనీస వసతులు లేక ఇంటర్వ్యూకు వెళ్లేందుకు నడి ఎండలోనే మహిళలు, యువతులు గంటల పాటు పడిగాపులు గాశారు. గురువారం సైతం అధికారుల పర్యవేక్షణ లేక ఇంటర్వ్యూల ప్రక్రియ ఆలస్యంగా సాగగా, కొంతమంది అభ్యర్థులు ఎండకు అలసిపోయారు. కొందరు టెంట్ల కిందనే కాసేపు సేద తీరుతూ కనిపించారు. కొంతమంది అభ్యర్థులు దళారుల సాయంతో ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఆరోపణలు వచ్చాయి.

ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

పార్టీ యూత్ నాయకుడు సురేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

బాధిత కుటుంబాలకు కొప్పుల పరామర్శ

ధర్మారం , ఏప్రిల్ 24 : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పు ల ఈశ్వర్ పరామర్శించారు. రామయ్యపల్లెకు చెందిన మార్క పెద్ద మల్లయ్య గౌడ్ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన గొల్లపల్లి నర్స య్య గౌడ్, రచ్చపల్లిలో బీ రాజేశం, నంది మేడారంలోని ఎస్సీకాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన దేవీరాజనర్సు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మూల మల్లేశం, ఆవుల శ్రీనివాస్ ఆవుల వేణు, బెల్లాల లక్ష్మణ్, చింతల తిరుపతి, రాజయ్య, తిరుపతి, బాలయ్య ఉన్నారు.

మాతృ మరణాలపై జాగ్రత్తలు తీసుకోవాలి : డీఎంహెచ్‌వో

పెద్దపల్లి, ఏప్రిల్24: ప్రభుత్వ దవాఖానల్లో మాతృ మరణాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో అన్నప్రాసన్న కుమారి సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. యూపీహెచ్‌సీ అడ్డగుంటపల్లి, పీహెచ్‌సీ రాఘవపూర్ పరిధిలో రెండు మాతృ మరణాలు జరిగాయన్నారు. మరణాలు నివారించేందుకు గర్భిణులు ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయుట, నాలుగు ఏఎన్‌సీ పరీక్షలను చేయించడం, బర్త్ ప్లానింగ్ చేయడం, హైరిస్కు గర్భిణులను గుర్తించి వారికి తగిన చికిత్సను దవాఖనలో అందేలా చూడాలన్నారు. వైద్యులు వాణిశ్రీ, సదానందం, స్రవంతి, శ్రీదేవి, మమత, మాణికేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రాజూనాయక్

పాలకుర్తి, ఏప్రిల్ 24 : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం స్ఫూర్తితో భామ్లనాయక్‌తండా మాజీ సర్పంచ్ బాదావత్ రాజూనాయక్ తండాలో నిరుపేద యువతి వివాహానికి గురువారం ఆర్థికసాయం చేశారు. గ్రామానికి చెందిన బీ వీరులక్ష్మి రెండో కుమార్తె శిరీష-అరుణ్‌కుమార్ వివాహానికి హాజరై రూ. 10 వేల సాయం చేశారు. కాగా, గత కొంతకాలంగా గ్రామంలో పేద యువతుల వివాహానికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు రమేశ్, సామ్యూల్, రాజేశ్, రాజేందర్, రవి, సామ్యూల్, గోపాల్ పాల్గొన్నారు.

కొలనూర్‌లో జీపీకి బాడీ ఫ్రీజర్ వితరణ

ఓదెల, ఏప్రిల్ 24: కొలనూర్‌లో జిగురు ఓదెలు జ్ఞాపకార్థం వారి కుమారులు, కూతురు బాడీ ఫ్రీజర్‌ను కొనుగోలు చేసి పంచాయతీకి గురువారం అందజేశారు. ఓదెలు భౌతికకాయాన్ని ప్రతిమ వైద్య కళాశాలకు అందజేసిన కుటుంబసభ్యులు, గ్రామంలో బాడీ ఫ్రీజర్ లేక పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని గ్రామానికి ఫ్రీజర్‌ను అందించారు. అలాగే సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓదెలు సంస్మరణ సభను నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎంపీపీ గంట రాములు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, సదాశయ ఫౌండేషన్ నాయకులు శ్రవణ్ కుమార్, లింగమూర్తి, భీష్మాచారి, ఆకుల మహేందర్, మూల ప్రేంసాగర్‌రెడ్డి, గోపు నారాయణరెడ్డి, గుండేటి మధు తదితరులు పాల్గొన్నారు.

జనంలోకి నెమలి

కోల్‌సిటీ,ఏప్రిల్ 24: అభయారణ్యంలో నుంచి నెమలి జనారణ్యంలోకి వచ్చింది. రామగుండం నగరపాలక సంస్థ 12వ డివిజన్ గోదావరిఖని ఫై వింక్లయిన్ ఏరియాలో గురువారం ఉదయం ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు గానీ, ఓ చెట్టుపై నెమలి ప్రత్యక్షమైంది. ఇది గమనించిన డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ నెమలిని దగ్గరకు తీసుకొని తమ సంరక్షణలో ఉంచారు. తర్వాత సమాచారం అందుకు అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని నెమలిని మళ్లీ అడవిలో వదిలిపెట్టేందుకు తీసుకెళ్లారు.

యాష్ పైప్‌లైన్ లీకేజీని నివారించాం

జ్యోతినగర్, ఏప్రిల్ 24 : ఎన్టీపీసీ ప్రభావిత కుందనపల్లి ఏరియా అక్బర్‌కాలనీలో బుధవారం ఎన్టీపీసీ యాష్‌పాండ్‌కు వెళ్లే పైపులైన్ లీకేజీని పూర్తిగా నివారించామని, పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందని ఎన్టీపీసీ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. యాష్‌పైప్‌లైన్ సాంకేతిక లోపంతో లీకేజీ కాగా, వెంటనే నివారణ చర్యలను ప్రారంభించి గురువారం పరిస్థితి అదుపులోకి తెచ్చామని చెప్పింది.

జేఎన్‌టీయూలో ఆరో రోజూ నిరవధిక సమ్మె



సమ్మెకు మద్దతు తెలుపుతున్న విద్యార్థులు

రామగిరి, ఏప్రిల్ 24 : జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సహాయ ఆచార్యులు చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారం ఆరో రోజు కొనసాగింది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు నిరవధిక సమ్మె చేస్తున్నారు. కాగా, గురువారం నిరవధిక సమ్మెకు విద్యార్థులు సైతం తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ప్రకటించాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్24 : ఏప్రిల్-మే వేసవి ఎండలు మండుతున్న సందర్భంగా తెలంగాణలోని అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు వేసవి సెలవులు ప్రకటించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ, వేసవిని దృష్టిలో ఉంచుకోని సెలవులు ప్రకటించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, నాయకులు కే శోభ, అంజనాదేవి ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

ఓదెల, ఏప్రిల్ 24 : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం ఆయన మండలంలో పర్యంటించారు. స్థానిక దవాఖాన, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఓదెల ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూ భారతి పథకం అమలుపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందేలా వైద్య సిబ్బంది తమ విధులను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. రైతులు భూ సమస్యలు ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయ రమణారావు, ఫ్యాక్స్ చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఏసీ వేణు, ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ సునీత, డాక్టర్ షహబాజ్‌ఖాన్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన

ముత్తారం, ఏప్రిల్ 24 : మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష పల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రెవెన్యూ డివిజన్ అధికారి సురేశ్, తహసీల్దార్ మధు సూదన్ రెడ్డి, ఎంపీడీవో సురేశ్, యాదగిరి రావు రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంథని : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎన్‌హెచ్ నిర్మాణ పనులు సకాలంలో చేపట్టాలి

మంథని, ఏప్రిల్ 24: వరంగల్ మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణ పనులను సకాలంలో చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి నిర్మాణంపై అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరంగల్ మంచిర్యాల మధ్య 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పనులు సకాలంలో చేపట్టి పూర్తి చేయాలన్నారు. రహదారికి సంబంధించి భూసేకరణ పనులు పూర్తి చేశామని, పెండింగ్ చెలింపులు ఎక్కడైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆనంతరం మంథనిలో నూతనంగా 50 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలంలో ఉన్న పాత డీఈ ఇరిగేషన్ కార్యాలయం, ఇతర కార్యాలయాలు, అనువైన చోటికి తరలించే పనులను పరిశీలించారు. దవాఖాన నిర్మాణానికి భూమి త్వరగా అందించాలన్నారు. పాత డీఈ ఇరిగేషన్ కార్యాలయాన్ని మరో చోటుకి తరలించాలన్నారు.

'మా గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలుపొద్దు'

అంతర్గాం, ఏప్రిల్ 24: తమ గ్రామాన్ని రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దంటూ మండలంలోని లింగాపూర్ గ్రామస్తులు గురువారం నిరసనకు దిగారు. గ్రామ మాజీ సర్పంచ్ అర్నపల్లి మల్లీశ్వరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పద్మాశంకర్, నాయకులు నిమ్మరాజుల రవి, గ్రామ మహిళలు, రైతులు, గ్రామస్తులు ఒకతాటిపైకి వచ్చి తమ గ్రామాన్ని విలీనం చేసేందుకు ఒప్పుకోమన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తమకు ఇచ్చిన హామీ మేరకు విలీనం జాబితాలో నుంచి తొలగించాలని కోరారు. లింగాపూర్ కార్పొరేషన్‌లో విలీనమైతే తమ గ్రామంలో పేదవారికి ఉపాధి కరువైతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి విలీన గెజిట్ రద్దు చేయించి లింగాపూర్‌ను జీపీగానే కొనసాగించాలన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్24: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీవో వీరబుచ్చయ్య హాజరై కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. పంచాయతీ రాజ్ శాఖ అవిర్భావం, తదితర అంశాలపై వివరించారు. అనంతరం మండలంలోని గంగారంలో మంచినీటి బావిని పరిశీలించారు. పూడిక తీత విషయమై సంబందిత అధికారులతో చర్చించారు. కూనారంలో వాటర్‌ప్లాంట్ వద్ద బోరు వేసే ప్రాంతాన్ని పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో తాగునీటి సమస్యపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పూర్ణచందర్ రావు, ఎంపీవో ఆరిఫ్, మిషన్ భగీరథ, గ్రిడ్ ఏఈలు కోర్నెల్, కల్యాణ్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్ , ఏప్రిల్ 24 : మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో గంగా లలిత, ఎంపీవో భాస్కర్ కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. 1992లో భారత రాజ్యాంగం 73వ చట్ట సవరణ జరిగిందన్నారు. సీనియర్ అసిస్టెంట్ వంశీ, ఏపీవో లావణ్య, కార్యదర్శులు రామ్మోహన్, రాజ్‌కుమార్, ప్రవళిక, అమల, తిరుపతితోపాటు ఇరువురాల శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ శంకర్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే

పెద్దపల్లి, ఏప్రిల్ 24 : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమ మేనని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ బొం కూరి శంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీఎన్జీవో కార్య దర్శి సత్యనారాయణ, టీజీవో కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, కిషన్, గండు కృష్ణమూర్తి, మెరుగు సతీష్, కే లక్ష్మణ్, కే సారయ్య, పరశురాముడు, ఎస్ కొమురయ్య, ఎస్ కనక య్య, శ్రీనివాస్ గౌడ్, మనోహర్ రెడ్డి, శ్రీధర్, సందీప్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, ఉపేందర్, కొమురయ్య, అనిత, సుమలత, సౌమ్య, శిల్ప పాల్గొన్నారు.

పట్టణ ప్రకృతి వనంను పరిశీలించిన అదనపు కలెక్టర్

కోల్‌సిటీ, ఏప్రిల్ 24: స్థానిక అశోక్‌నగర్ ఉపరితల జలాశయం ఆవరణలోని పట్టణ ప్రకృతి వనంను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ గురువారం పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా ఉద్యానవనాలు, పచ్చదనం పెంపొందించేందుకు కేటాయించిన నిధులు సద్వినియోగం చేసుకొని అమృత్ మిత్రల సహకారంతో నగరంలోని పట్టణ ప్రకృతి వనాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 7, 27, 29 డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈఈ రామన్, ఏఈ తేజస్విని, టీపీఎస్ నవీన్ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 24: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయర మణారావు పేర్కొ న్నారు. మండలం లోని రాఘవాపూర్, రంగా పూర్ సబ్బితం, అందుగులపల్లి గ్రామాల్లో గురువారం అప్పన్నపేట సింగిల్ విం డో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సంబం ధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, సీఈవో గడ్డి తిరుపతి, నూగిళ్ల మల్లయ్య, గండు వెంకటేశం రైతులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్, ఏప్రిల్ 24 : పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రాస్త్రీనగర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు హాజరై ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈవో సంతోశ్, పాలకవర్గం సభ్యులు, రైతులు, నాయకులు ఉన్నారు..

ఆలయానికి బిరువా వితరణ

సుల్తానాబాద్, ఏప్రిల్ 24 : పట్టణంలోని గుడిమిట్టపల్లిలోని రాజరాజేశ్వరస్వామి ఆలయానికి సుల్తానాబాద్ వాసవీ క్లబ్ సభ్యులు బిరువాను గురువారం అందజేశారు. పూజ సామగ్రి పెట్టుకోవడానికి బీరువా అవసరం ఉందనీ పూజారి తెలుపడంతో వెంటనే స్పందించిన వాసవీ క్లబ్ సభ్యులు అందించారు. అశోక్, హరీశ్‌కుమార్, ప్రదాన కార్యదర్శి రామిడి రవీందర్, కోశాధికారి అనుగం వంశీకృష్ణ, తదితరులున్నారు.

ఆర్జీ-3లో కార్పొరేట్ క్రీడా జీఎం పర్యటన

రామగిరి, ఏప్రిల్ 24: సింగరేణి సంస్థ కార్పొరేట్ క్రీడా విభాగం జీఎం ఎలీషా గురువారం ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1,2 గనులను సందర్శించారు. ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం వెంకటరమణ, ఇతర అధికారులు ముందుగా ఆయన్ను శాలువాతో సత్కరించి మొక్కను అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశంలో స్టోర్‌లో యంత్రాల విడిభాగాల ప్రక్రియ విధానం, మెటీరియల్ ఆఫ్ కీపింగ్ సంబంధించిన విషయాలపై చర్చించారు. అనంతరం పిట్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. స్టోర్స్ మెటీరియల్ ఇన్వెంట్రీ తగ్గించాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని పలు సలహాలు, సూచనలు చేశారు. ఇంజనీర్ శేఖర్ బాబు, పీఓ రాజశేఖర్, డీజీఎం కాశీ విశ్వేశ్వరరావు, ఇంజనీర్లు ఉదయ భాస్కర్, చంద్రశేఖర్ ఉన్నారు.

సంజయ్ సింఘ్వీ సంతాప సభ

గోదావరిఖని, ఏప్రిల్ 24: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ టీయూసీఐ కార్యాలయంలో గురువారం టీయూసీఐ అఖిల భారత ప్రధానకార్యదర్శి సంజయ్ సింఘ్వీ సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి టీయూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తోకల రమేశ్ పాల్గొని సంజయ్ సింఘ్వీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. బుధవారం అర్ధరాత్రి సంజయ్ సింఘ్వీ ఆనారోగ్యంతో మృతిచెందడం కార్మికవర్గంను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇక్కడ టీయూసీఐ జిల్లా నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, గూడూరు వైకుంఠం, ఇనుగాల రాజేశ్వర్, మెతుకు వెంకటేశం తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక ప్రక్రియపై హైకోర్టులో కేసు

మంథని, ఏప్రిల్ 24: మంథని ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నియమ నిబంధనల ప్రకారం జరగలేదని, ఎలాంటి అర్హత లేని రాష్ట్ర మహా సభ అనుబంధ రిజిస్ట్రేషన్ తప్పుడు బైలాతో నిర్వహించారని హైకోర్టులో కేసు వేసినట్లు సముద్రాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను పోటీ నుంచి తప్పించి తన ప్రత్యర్థిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడాన్ని తాను అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ ఫైల్ చేయగా పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు, ఎన్నికల అధికారులకు, అధ్యక్షుడిగా ప్రకటించిన ఎల్లంకి వంశీధర్‌లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ ఈ కేసును జూన్ 7వ తేదీకి కోర్టు వాయిదా వేసినట్లు పిటిషన్ దారుడు సముద్రాల రమేశ్ ప్రకటనలో తెలిపారు.

ఎన్టీపీసీలో మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జ్యోతినగర్, ఏప్రిల్ 24 : ప్రపంచ కార్మికుల దినోత్సవం 139వ మేడేను పురస్కరించుకొని గురువారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సంఘం నేత చిలుక శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గంపై అనుసరిస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లు, ప్రవేటీకరణకు నిరసనగా మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో తలపెట్టిన మేడే వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఇక్కడ నాయకులు బీ బుచ్చన్న, జీ కుమార్, గుండు రాజయ్య, పీ రమేశ్, జె కృష్ణ, బీటీ రెడ్డి, జె సందీప్, మనోహర్, తిరుపతి ఉన్నారు.

విజయవంతం చేయాలి

గోదావరిఖని, ఏప్రిల్ 24: దేశంలోని కార్మికవర్గంకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లు విభజించి కార్మికులను కట్టుబానిసలుగా చేస్తున్న కుట్రలకు నిరసనగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంద యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జీడీకే- 2 ఇంక్లైన్‌లో జరిగిన యూనియన్ గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దుపై తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో కార్మికులు విజయవంతం చేయాలన్నారు.

ఉగ్రవాదుల కాల్పులపై న్యాయవాదుల నిరసన

మంథని, ఏప్రిల్ 24: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడి ఘటన అమానుషమని మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు అన్నారు. గురువారం మంథని కోర్టు ప్రాంగణంలో అధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా నియామకమైన సివిల్ జడ్జి భవానితో బార్ అసోసియేషన్ సభ్యులు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో జనరల్ సెక్రటరీ సహేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రఘోత్తమరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, సీనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 24 : కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పులను నిరసిస్తూ గురువారం గోదావరిఖని న్యాయవాదులు విధుల బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిఫ్